క్లుప్తంగా

20న ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లరేవు: ఈ నెల 20వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్రీమ్ సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లరేవు హైస్కూల్ పక్కన గల బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ శిబిరం జరుగుతుందన్నారు. శిబిరంలో పిఠాపురం సీఎంసీ ఆస్పత్రి వైద్యులచే ఉచిత నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేస్తామన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పాదాలమ్మ తల్లి జాతర

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం గ్రామదేవత పాదాలమ్మ తల్లి జాతర గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. బుధవారం అమ్మవారి తీర్థం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన



వీరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన చేస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు పండితులచే స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, ఏకాదశ రుద్రాభిషేకం, మారేడు దళాలతో బిల్వార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు దళిత వేదన సంపుటి ఆవిష్కరణ

యానాం: కొల్లు వెంకన్న మాస్టారు దళిత వేదన పేరుతో రాసిన పద్య, గద్య, వచన, గేయ సంపుటిని బుధవారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకుడు సత్యనారాయణ మంగళవారం తెలిపారు. స్థానిక సర్కిల్ ది యానాం భవనంలో కలైమామణి, ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి దక్షిణ భారత దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, రిటైర్డ్ ఇంజినీర్ వినకోటి శ్రీరామచంద్రమూర్తి, రిటైర్డ్ ఆర్ఏఓ నామాడి అప్పారావు, పిల్లి రాంబాబు, గుత్తాల శ్రీరాములు, భూషణం, కేవీవీ సత్యనారాయణ, కుంచే సూర్యనారాయణ తదితరులు హాజరవుతారన్నారు.

పుదుచ్చేరి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ కైవసం



కౌంటింగ్ కేంద్రం వద్ద వైథిలింగాన్ని సత్కరిస్తున్న డీఎంకే, కాంగ్రెస్ నేతలు

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజవర్గ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ(ఇండియా కూటమి) కైవసం చేసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో దిగిన సిటింగ్ ఎంపీ వి.వైథిలింగం తన సమీప ప్రత్యర్థి బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయంపై 1,11,123 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైథిలింగంకు 3,67,633 ఓట్లు రాగా నమశ్శివాయంకు 2,56,510 ఓట్లు వచ్చాయి. పుదుచ్చేరి పార్లమెంటరీ స్థానానికి మొత్తంగా 26 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. అయితే యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయానికి స్పష్టమైన ఆధిక్యం కనిపించింది. యానాం నియోజకవర్గంలో నమశ్శివాయంకు 22,127 ఓట్లు లభించగా, వైథిలింగానికి 6,947 ఓట్లు మాత్రమే వచ్చాయి. పుదుచ్చేరి లోక్‌సభ స్థాన పరిధిలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం వైథిలింగం ఆధిక్యత చూపించడంతో విజయం ఆయననే వరించింది. ఈ ఎన్నికల్లో యానానికి చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి పోషియ్యకు 1,074 ఓట్లు లభించాయి. పుదుచ్చేరిలో కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగం విజయం సాధించడంపై స్థానిక యానాం కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు, బీరాస్వామి, లంకే శ్రీనివాస్, అంజయ్య, సీహెచ్ చౌదరి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి

యానాం: నియోజకవర్గ పరిధిలో లోక్‌సభ ఎన్నికకు సంబంధించి ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లలో పూర్తి చేశారు. మొదటి రౌండ్‌లో బీజేపీ, ఎన్ఆర్‌కాంగ్రెస్ కూటమి అభ్యర్థి ఎ.నమశ్శివాయంకు 6,996 ఓట్లు, రెండో రౌండ్‌లో 6,848 ఓట్లు, మూడోరౌండ్‌లో 6,115 ఓట్లు, నాలుగో రౌండ్‌లో 2,168 ఓట్లు లభించాయి. కాంగ్రెస్(ఇండియా కూటమి) అభ్యర్థి వి.వైథిలింగంకు మొదటి రౌండ్‌లో 1,950, రెండో రౌండ్‌లో 1,873, మూడో రౌండ్‌లో 2,750, నాలుగో రౌండ్‌లో 374 ఓట్లు లభించాయి.

మండపేటలో టీడీపీ విజయం



ఆర్వో ఎల్లారావు నుంచి డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న వేగుళ్ల జోగేశ్వరరావు

- వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా వేగుళ్ల గెలుపు
- 44,435 ఓట్ల మెజార్టీ

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయం సాధించారు. ఆయన సమీప ప్రత్యర్థి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుపై 44,435 ఓట్ల ఆధిక్యత ప్రదర్శించారు. నాలుగోసారి వేగుళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,20,494 కాగా, 1,91,959 ఓట్లు (87.06 శాతం) పోలయ్యాయి. 94,222 మంది పురుషులు, 97,735 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఓట్లు వేశారు. వేగుళ్ల జోగేశ్వరరావుకు 1,16,309, తోట త్రిమూర్తులుకు 71,874 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కామన ప్రభాకరరావుకు 1,484 ఓట్లు పోలవ్వగా, ఆయనతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు. మే 13న పోలింగ్ నిర్వహించగా, మంగళవారం అమలాపురం సమీపంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కింపును నిర్వహించారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియను ప్రారంభించగా, తొలుత పోస్టల్ ఓట్లను లెక్కించారు.



అంగరలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

అభ్యర్థులకు పోలైన ఓట్లు ఇలా..

అభ్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు
వేగుళ్ల జోగేశ్వరరావు	టీడీపీ	1,16,309
తోట త్రిమూర్తులు	వైఎస్సార్ సీపీ	71,874
కామన ప్రభాకరరావు	కాంగ్రెస్	1,484
గుర్రపు కొత్తియ్య	బీఎస్పీ	453
నందికోళ్ల రాజు	నవతరం	131
సాదే డేవిడ్‌రాజు	ఆర్‌పీఐ(ఎ)	120
నల్లా చిన్నారావు	లిబరేషన్ కాంగ్రెస్	293
కోన సూర్యభాస్కరరావు	స్వతంత్ర	103
మార్ని సత్యనారాయణ	స్వతంత్ర	1,161
మందపల్లి రవి	స్వతంత్ర	101
రాయుడు శ్రీనివాస్	స్వతంత్ర	140
కోన వీ.వెం.సత్యనారాయణ	స్వతంత్ర	157
కోన శ్రీకృష్ణ	స్వతంత్ర	152
నోటా	--	1,568

అనంతరం ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించే ప్రక్రియను చేపట్టారు. మొదటి నుంచి చివరి రౌండ్ వరకూ టీడీపీ అభ్యర్థి వేగుళ్ల ఆధిక్యతలో కొనసాగారు. మొత్తం పది టేబుళ్లపై 23 రౌండ్లలో 223 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఈవీఎంల ఓట్లను లెక్కించారు.

రామచంద్రపురంలో సుభాష్ గెలుపు



అధికారుల నుంచి ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న సుభాష్

టీడీపీ అభ్యర్థికి 25,520 ఓట్ల మెజార్టీ

రామచంద్రపురం: సార్వత్రిక ఎన్నికల్లో రామచంద్రపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ 25,520 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థి సుభాష్‌కు 96,149 ఓట్లు పోలవ్వగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌కు 70,629 ఓట్లు వచ్చాయి. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో సుభాష్‌కు 26,370 ఓట్ల మెజార్టీ లభించింది. మొత్తం 24 రౌండ్లలో 1,73,917 ఓట్లను లెక్కించారు. మొదటి రౌండ్ నుంచి టీడీపీ అభ్యర్థి తన ఆధిక్యతను కనబర్చారు. తొలి రెండు రౌండ్లలోనే సుభాష్ 4,800 మెజార్టీని కనబరుస్తూ వచ్చారు. చివరి రౌండ్ వరకూ టీడీపీ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది.

షాపుల బంద్

రామచంద్రపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌ను పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో షాపులు మూసివేశారు. ముఖ్యంగా వ్యాపార కూడలి ద్రాక్షారామలో అన్ని వ్యాపార సంస్థలు మూసివేయడంతో కర్ఫ్యూను తలపించింది. సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాధారణ పోలీసులు, ఇతర పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి.



ద్రాక్షారామ ప్రధాన కూడలి బోస్ బొమ్మ సెంటర్ వద్ద పోలీసుల బందోబస్తు



ద్రాక్షారామ ప్రధాన రహదారిలో మూతపడిన షాపులు

కౌంటింగ్ సరళి ఇలా..

రామచంద్రపురం: గత నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో రామచంద్రపురం అసెంబ్లీ బరిలో మొత్తం 13 మంది పోటీలో నిలిచారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ మధ్య సాగింది. ఎన్నికల అనంతరం మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తంగా 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొదటి రౌండ్‌లో టీడీపీ అభ్యర్థి సుభాష్‌కు 5,169 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి సూర్యప్రకాశ్‌కు 3,266 ఓట్లు లభించాయి దీంతో మొదటి రౌండ్‌లో సుభాష్‌కు 1,603 ఓట్ల మెజార్టీ వచ్చింది.

రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లు, మెజార్టీ ఇలా ఉంది

రౌండ్	వైఎస్సార్‌సీపీ	టీడీపీ	మెజార్టీ
1	3266	5169	1603
2	1937	4849	2912
3	2502	4412	1910
4	2711	3716	1005
5	2646	4077	1431
6	2560	4426	1866
7	3350	4094	744
8	2387	3850	1463
9	3491	2872	619(వైఎస్సార్ సీపీ)
10	2993	4103	1110
11	3985	4324	339
12	2376	4139	1763
13	2303	4626	2323
14	2342	4025	1683
15	2730	4594	1864
16	3080	3450	370
17	2954	3975	1021
18	3832	2616	1216(వైఎస్సార్ సీపీ)
19	3139	3456	326
20	3188	3459	271
21	2662	4074	1412
22	3199	3694	495
23	2585	3842	1257
24	3541	2869	672
25	770	1438	668
మొత్తం	70629	96149	25520

ప్రధాన రహదారిని విస్తరించరూ..

- ఇరుకు మార్గంతో ప్రయాణికుల ఇబ్బందులు
- అంగర-కపిలేశ్వరపురం రోడ్డుతో సమస్యలు

కపిలేశ్వరపురం: మండల కేంద్రమైన అంగర-కపిలేశ్వరపురం ఆర్అండ్‌బీ రహదారిని విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. మండపేట నుంచి అంగర వరకూ ఈ రహదారిని గతంలో విస్తరించారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న అంగర-కపిలేశ్వరపురం రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారితో పాటు అనేక మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇసుక, ఇటుక, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారి నిర్మాణ పనుల నేపథ్యమిదీ..

కపిలేశ్వరపురం-మండపేట రహదారి విస్తరణ పనులు 2016లో చేపట్టారు. 16.2 కిలోమీటర్ల మేర 3.5 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ రహదారిని ఏడు మీటర్లకు వెడల్పు చేసేందుకు అప్పట్లో రూ.16.03 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 11 కిలోమీటర్ల మేర బీటీ, 3.2 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డుగా మెరుగుపర్చారు. నిధుల సర్దుబాటు కారణంగా 14.2 కిలోమీటర్ల మేరకు మాత్రమే పనులు చేపట్టారు. దీంతో 1.7 కిలోమీటర్ల మేర కపిలేశ్వరపురం-అంగర రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. మండల కేంద్రం కావడంతో ఈ రహదారిపై నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. త్వరితగతిన రహదారిని విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



విస్తరణకు నోచుకోని కపిలేశ్వరపురం-అంగర రహదారి

తొలకరి సాగుకు చొరవ చూపాలి

కాజులూరు: తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని చేదువాడ, బందనపూడి, కాజులూరు తదితర గ్రామాల్లో సోమవారం ఏఓ అశోక్ పర్యటించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బందనపూడిలో ఆయన మాట్లాడుతూ గోదావరి తూర్పుడెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు ఈ నెల ఒకటో తేదీన సాగునీరు విడుదల చేశారన్నారు. పంట కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరుతుందని, రైతులు పంట దమ్ములకు సిద్ధం కావాలన్నారు. జూన్ రెండో వారం నాటికి నారుమడులు చల్లుకుని, జూలై మొదటివారం నాటికి నాట్లు పూర్తిచేస్తే, అక్టోబర్ నెలాఖరు నాటికి పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా చేతికొస్తుందన్నారు. తద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో దాళ్వా సాగు చేపట్టి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అంతర పంటలైన పెసర, మినుము మూడో పంటగా సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు చొరవ చూపి సాధ్యమైనంత త్వరగా తొలకరి పనులు ప్రారంభించాలన్నారు.



బందనపూడిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ అశోక్

ఉపాధితో ఊతం



అల్లవరంలోని చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

- ఉపాధి కూలీలకు రోజుకి రూ.300 వేతనం
- నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

అల్లవరం: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఊతం ఇచ్చేలా కొత్త ఆర్థిక సంవత్సరంలో శరవేగంగా పనులు చేపట్టింది. వ్యవసాయానికి అనుబంధంగా ఉపాధి పనులు నిర్వహించి తద్వారా ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను ముమ్మరంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. పంట కాలువలు, డ్రయిన్లలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించడం, పూడిక తీత పనులు, రైతులకు ఫారమ్ పాండ్స్ తవ్వకాలు, కొబ్బరి చెట్లకు పళ్లాలు ఏర్పాటు చేయడం, పుంత రోడ్ల అభివృద్ధి వంటి పనుల్లో ఉపాధి కల్పించనున్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు ఆ పనులతో రైతులకు లాభదాయకంగా ఉండేలా ఉపాధి శాఖ జాగ్రత్తలు తీసుకుంటుంది.

ఉపాధి పనుల్లో పారదర్శకత, పనుల్లో నాణ్యత పెంచడానికి పని ప్రదేశంలో నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా పని స్వభావాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేసేలా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా, వారికి గరిష్ఠంగా రోజుకి రూ.300 వేతనం ఇస్తున్నారు. గతేడాది రూ.272 ఉన్న వేతనాన్ని మరో రూ.18 పెంచి గరిష్ఠంగా రూ.300గా నిర్ణయించారు. ఈ వేతనం ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో చేసిన పనికి సంబంధించిన వేతనాలు ఇప్పటికే కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి వేతనం పెంపుపై ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏప్రిల్ నుంచి రోజుకు రూ.300 వేతనం



వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా ఉపాధి హామీ పథకంలో ఇంటిల్లిపాదికి పని కల్పించి వేతనాలు అందిస్తున్నారు. ఏప్రిల్ నుంచి రోజుకి రూ.300 వేతనం ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకంతో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుంది. వేసవిలో పంటబోదెలు, కాలువ పనులు, పూడికతీత పనులు చేశాం.

– బుంగా బాలాస్వామి, డి.రావులపాలెం

2.80 లక్షల పనిదినాలే లక్ష్యం

ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకూ 1.20 లక్షల పని దినాలు కల్పించాం. కొత్త ఆర్థిక సంవత్సరంలో 2.80 లక్షల పనిదినాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న చెరువులు, పంట బోదెలు, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాం. చేసిన పనులకు ఎప్పటికప్పుడు కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నాం.

– విప్పర్తి శ్రీనుబాబు, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, అల్లవరం

వ్యవసాయానికి అనుబంధంగా చేస్తున్న ఫారమ్ పాండ్స్, కొబ్బరిచెట్లకు పళ్లాల ఏర్పాటు, వరి క్షేత్రాలకు పుష్కలంగా సాగునీరు వెళ్లేందుకు పంట బోదెల్లో పూడిక తీత, కాలువల్లో చెత్తా చెదారం తొలగింపు, రెవెన్యూ డ్రెయిన్‌లో పూడికతీత పనులతో ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామ దేవతగా పేరొందుతున్న పోలేరమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి సంబరం, జాతర నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భారీ అన్నసమారాధన, తీర్థం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



సమనస పోలేరమ్మ తల్లి

నిద్ర గన్నేరు.. దీని తీరే వేరు



పసుపు పచ్చని ఆకులతో ఆకట్టుకుంటున్న నిద్రగన్నేరు చెట్టు

రాయవరం: సాధారణంగా నిద్రగన్నేరు చెట్టు పచ్చని ఆకులను కలిగి ఉంటుంది. మండపేట-కాకినాడ రహదారిలో మండలంలోని మాచవరం వద్ద ఉన్న నిద్రగన్నేరు చెట్టు ఆకులు పసుపు పచ్చని ఆకులను కలిగి చూపరులను ఆకట్టుకుంటోంది. రోడ్డున వెళ్తున్న ప్రయాణికులు ఆ చెట్టును ఆసక్తిగా తిలకిస్తున్నారు. చెట్లలో మెలనిన్ లోపం కారణంగా ఇలా సహజ లక్షణాన్ని కోల్పోతాయని వ్యవసాయాధికారి ప్రభాకర్ పేర్కొన్నారు.

ఆకు కూరలు..ఆదాయ వనరులు

- నీటి సాగుతో అధిక ఆదాయం
- అన్ని కాలాలకూ అనువైన పంటలు
- స్వల్ప వ్యవధిలో దిగుబడి

రాయవరం: ప్రస్తుత కాలంలో ఆకుకూరల వినియోగం బాగా పెరిగింది. పోషకాలు, విటమిన్లు అధికంగా లభించే ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు కూడా సూచించడంతో ఆకుకూరల వినియోగం అధికమవుతుంది. ఆకుకూరల్లో తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గూంగూర తదితర రకాలను రైతులు సాగు చేసుకోవచ్చు. స్వల్ప వ్యవధిలో పంట చేతికి వచ్చే ఆకుకూరల సాగును రైతులు చేపట్టడం వలన తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చంటున్నారు ఉద్యానవన శాఖ అధికారులు.

పొలం దుక్కులు

పొలాన్ని మెత్తటి దుక్కి వచ్చే వరకు మూడు నాలుగు సార్లు దున్ని మట్టిని మెత్తగా చేసుకోవాలి. దుక్కిలో ఎకరానికి పది టన్నుల పశువుల ఎరువు, 300 కిలోల వేపపిండి, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, పది కిలోల జింక్ సల్ఫేట్, 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించి విత్తనాలు చల్లుకోవాలి. జింక్ సల్ఫేట్, సూపర్ ఫాస్ఫేట్ కలవకుండా చల్లాలి.

విత్తనాలు నాటే విధానం

నతోటకూర విత్తనాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అందుకని వాటిని ఇసుకతో కలిపి చల్లుకోవాలి. ఎకరానికి 800 గ్రాముల విత్తనం సరిపోతుంది. పది కిలోల ఇసుకలో విత్తనాలు కలిపి మడుల్లో పలుచగా చల్లుకోవాలి. తర్వాత మెత్తటి మట్టితో పలుచటి పొరలా కప్పాలి.

- పాలకూర విత్తనాలను 3 నుంచి 4 సెంటీమీటర్ల లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొలక సరిగ్గా రాదు.
- ధనియాలు విత్తే ముందు రెండు బద్దలు చేయాలి. లేకుంటే మొలక ఆలస్యంగా మొదలవుతుంది.
- వేసవి ఎండవేడిమి రక్షణ కోసం రకరకాల షెడ్లను అవసరాన్ని బట్టి వాడుకోవాలి.

సస్యరక్షణ చర్యలు

ఆకుకూర విత్తనాల శుద్ధికి వేప శిలీంధ్ర నాశినిని కిలో విత్తనంలో ఎనిమిది గ్రాములు కలిపి విత్తితే, వేరు కుళ్లు తెగులు అంతగా రావు. విత్తనం విత్తిన 48 గంటల లోపు లీటరు నీటికి నాలుగు మి.లీ పెండి మిథలిన్ కలుపు నాశిని కలిపి పిచికారీ చేస్తే తొలి దశలో కలుపు రాదు. పంట ఎదుగుదలకు లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున 19:19:19ను ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వారానికి ఒకసారి పంటకు నీరందించాలి. తుంపర్ల విధానంలో నీరందించడం వలన అన్ని విధాలుగా మేలు కలుగుతుంది. ఆకులపై దుమ్ము, ధూళి ఉండదు. పురుగులు, గుడ్లు, నల్లలు రాలిపోతాయి. ఆకుకూరలను సలాడ్‌లో ఉపయోగిస్తారు. వీలైనంత వరకు క్రిమి సంహారక మందులు వాడక పోవడం మంచిది. పేను బంక, ఆకు ముడత, ఆకు గొంగళి పురుగులను పంటను ఆశించకుండా వేప సంబంధిత మందులను పిచికారీ చేయాలి. మందు పిచికారీ చేసిన 5-6 వారాల తర్వాత ఆకులను కోత కోయాలి. తర్వాత ఎకరాకు పది కిలోల యూరియా చల్లాలి.



రైతులు సాగు చేస్తున్న పాలకూర, కొత్తిమీర

కోత కోసే పద్ధతి

తోట కూరలో సీఓ-1, సీఓ-2 రకాలను విత్తిన 25 రోజుల్లో వేర్లతో సహా పీకి అమ్ముకోవాలి. కో-3, కో-5, పూసా, కీర్తి రకాలను విత్తిన 25 రోజుల తర్వాత కొమ్మలను కత్తిరించి, తర్వాత ప్రతి వారం రోజులకు కోత చొప్పున 90 రోజుల వరకు కోతలు కోయవచ్చు. ఆకుల కట్టలను గోనె సంచులు, బట్టల్లో కాకుండా ప్లాస్టిక్ క్రైట్స్ పెట్టి రవాణా చేయడం శ్రేయస్కరం.

మల్టీ కట్ రకాన్ని విత్తుకోవాలి

ఇప్పుడు కొత్తిమీర సాగులో మల్టీ కట్ రకాలు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఒకేసారి కొత్తిమీరను పీకి అమ్ముకునే వారు. ఇప్పుడు నాలుగు నుంచి ఐదు సార్లు కటింగ్ చేసి అమ్ముకోవచ్చు. దీని వలన రైతుకు ఎక్కువ లాభం పొందే అవకాశం ఉంది. పలు రకాల కంపెనీల్లో మల్టీ కట్ రకానికి చెందిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. గోంగూరలో పుల్ల గూంగూర, మంచి గూంగూర రకాలనే మన ప్రాంతానికి చెందిన రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. గుంటూరు గూంగూర, ధనాసారి గూంగూర రకాలను కూడా మన ప్రాంతంలో సాగు చేసుకుంటే రైతులు మంచి లాభం పొందే అవకాశం ఉంది.